క్లుప్తంగా

సమయ పాలన పాటించండి



తమ్మడేపల్లిలో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, మద్దనకుంట, వి.అగ్రహారం గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. సమయ పాలన పాటించాలని సూచించారు. అలాగే ప్రజలు వివిధ సమస్యల పై సచివాలయానికి వస్తారని, వారి సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలన్నారు. అలాగే సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏటీఎం సేవలు పునరుద్ధరించండి



ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు: మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఏటీఎం సేవలను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంగళవారం వారు ఎస్‌బీఐ వద్ద నిరసన తెలిపారు. ఏటీఎం ఉండి కూడా దానిని ఎనిమిది నెలలుగా తెరవకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏటీఎం లేకపోవడంతో ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్లి కమీషన్ ఇచ్చి నగదు పొందుతున్నారన్నారు. వెంటనే ఎస్‌బీఐ ఏటీఎం సేవలను పునఃప్రారంభించి ఖాతాదారుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పూజారప్ప



పావగడ: తాలూకాలోని బి దొడ్డహట్టి గ్రామానికి చెందిన రైతు ఉద్యమ నాయకుడు పూజారప్ప కర్ణాటక రాజ్య రైతు సంఘం హసిరు సేన జిల్లా అధ్యక్షుడిగా మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఆయన తాలూకా రైతు హసిరు సేన సంఘం అధ్యక్షుడిగా రెండు సార్లు పనిచేశారు. ఈ సందర్భంగా పూజారప్ప మాట్లాడుతూ తనను జిల్లా స్థాయి రైతు సంఘం అధ్యక్షుడిగా నియమించిన రాజ్యాధ్యక్షుడు హెచ్‌ఆర్ బసవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పూజారప్ప ఎంపిక పట్ల స్థానిక పలు రైతు సంఘాలు, దళిత సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు.

ఆదర్శ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా ప్రకాష్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల అభివృద్ధి సంఘం అధ్యక్షుడిగా సమాజ సేవకుడు ప్రకాష్ ఎన్నికయ్యారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఎన్నికలో మొత్తం 18 మంది సభ్యుల్లో 8 మంది సభ్యులు ప్రకాష్‌కు మద్దతు ప్రకటించగా 10 మంది సభ్యులు ఇతరులకు మద్దతు తెలిపారు. అధిక మంది సభ్యులు ప్రకాష్ వైపు నిలవడంతో ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ ఎన్నికయ్యారు.

గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకోండి

అగళి: మండలంలో సొంత వ్యవసాయ భూమి లేకుండా మరొకరి భూమి కౌలు చేస్తున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గోరంట్ల: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరు నగరంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా చదివిన వారు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లిష్ , కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 9000487423 నంబరును సంప్రదించాలన్నారు.

మట్టి పరీక్ష .. పంటకు రక్ష

భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయాలి. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలి. ఒక పంట కోత ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల అటు భూమి, ఇటు పంటకు శ్రీరామ రక్ష.

- భూసార పరీక్షలతో అధిక దిగుబడి
- ఏ పంటలు వేసుకోవాలన్నదానిపై అవగాహన
- 3,183 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం



లేపాక్షిలో భూసార పరీక్షలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీలత

లేపాక్షి: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వాస్తవానికి ఎక్కువ మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటలు సాగుచేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు తప్ప, దిగుబడులు పెరుగడం లేదు. అంతేకాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

3,183 మట్టి నమూనాలు...

హిందూపురం వ్యవసాయశాఖ డివిజన్ వ్యాప్తంగా ఈ ఏడాది 3,183 మట్టి నమూనాలను సేకరించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అదేవిధంగా వాటి ఫలితాలను కూడా రైతులకు వ్యవసాయాధికారులు అందజేయనున్నారు. ఇప్పటికే 1,177 నమూనాలను వ్యవసాయశాఖ సిబ్బంది సేకరించారు.

ప్రయోజనాలు ఇలా...

మట్టి నమూనా పరీక్షించడం వల్ల ఏఏ పోషకాలు ఎంత శాతం భూమిలో ఉందో తెలుసుకోవచ్చు. రైతుకు ఆ భూమిలో ఏ పంట వేసుకోవచ్చనో తెలుస్తుంది. ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పోటాష్ వంటి ఎరువులు ఎంత మోతాదులో పంటలకు వేయాలో తెలుస్తుంది. స్థూల, సూక్ష్మ పోషకాలు రైతుల పొలాల్లో ఎంతశాతం ఉందని స్పష్టమవుతుంది. సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, మెగ్నీషియం, కాపర్ వంటి పోషకాల గురించి ఫలితాల్లో తెలుస్తుంది. ఈ మట్టి నమూనా పరీక్షల ద్వారా వెల్లడైన ఫలితాల ద్వారా రైతులకు ఖర్చు తగ్గించి ఎరువుల యాజమాన్యం గురించి వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తారు.

మట్టి నమూనాలు తీసే పద్ధతి ఇలా..

- పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి సేకరించకూడదు. పంటకు నీరు పెట్టిన తర్వాత, నీడపడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలున్న చోట, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయకూడదు.
- వేసవిలో పంట సాగు చేయక ముందు భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో వీ ఆకారంలో 15–20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింద వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలంలో మొత్తంగా 8–10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగాలను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అరకిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డివేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్‌లో గానీ పాలిథిన్ కవర్‌లో గానీ నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.

మట్టి నమూనాలు ఇలా

మండలం	లక్ష్యం	పూర్తయింది
లేపాక్షి	496	243
చిలమత్తూరు	620	82
పరిగి	620	370
హిందూపురం	744	387
గోరంట్ల	703	95
మొత్తం	3,183	1,177

సద్వినియోగం చేసుకోవాలి



హిందూపురం వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న భూసార పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మట్టి నమూనా పరీక్షల ద్వారా రైతులకు అనేక లాభాలు పొందవచ్చు. మట్టి నమూనాల పరీక్షలతో ఏఏ పంటలను పెట్టుకోవచ్చో మట్టి నమూనా కార్డులో పొందుపరుస్తారు. ప్రతి రైతూ సేవా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మట్టి నమూనాలను సేకరిస్తాం.

– అల్తాఫ్ అలీఖాన్, వ్యవసాయ సహాయ సంచాలకులు, హిందూపురం

- మట్టి సేకరణకు వ్యవసాయశాఖ సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్ద మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు.

వృద్ధురాలిని అనాథాశ్రమంలో చేర్చిన యువకులు



వృద్ధురాలు లక్ష్మీని అనాథాశ్రమంలో చేర్పిస్తున్న అల్ ఇందాద్ ట్రస్ట్ సభ్యులు

హిందూపురం టౌన్: స్థానిక పరిగి బస్టాండ్‌లో దగ్గరున్న వృద్ధురాలిని అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆమెను అనాథాశ్రమంలో చేర్చారు. వివరాల్లోకెళితే.. కర్ణాటకలోని ఎస్ఆర్ పల్లికి చెందిన లక్ష్మీ (70) వృద్ధురాలు ఆదివారం తన కుమారుడితో కలసి హిందూపురం వచ్చింది. అయితే కుమారుడు తిరిగి వస్తానని చెప్పి ఆమెను ఇక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం అక్కడే రాత్రి వరకూ ఎదురు చూసి బస్టాండ్ వద్దే నిద్రించింది. దీంతో అక్కడ ఉన్న వారు గమనించి అల్ ఇందాద్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, కార్యదర్శి ఉమర్ ఫారూక్, జాయింట్ కార్యదర్శి ఉస్మాన్, రిహాన్ తదితరులు అక్కడికి చేరుకుని ఆ వృద్ధురాలిని పట్టణంలోని అనాథాశ్రమంలో చేర్చి మానవత్వం చాటుకున్నారు.

నేడు వీరచిన్నయ్యస్వామి జాతర

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో వెలసిన వీరచిన్నయ్యస్వామి జాతర మహోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం జాతర ఉత్సవం ఉంటుందన్నారు. రాత్రి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు.

అనుమానితులను గుర్తించండి

రొళ్ల: గ్రామాల్లో ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి కుష్ఠువ్యాధి అనుమానితులను గుర్తించాలని గుడిబండ పీహెచ్‌సీ డాక్టర్ సౌందర్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో అన్ని గ్రామాల ఆశ వర్కర్లకు కుష్ఠువ్యాధి అనుమానితుల గుర్తింపుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుధారాణి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో డెంగీ కేసు నమోదు

- శ్రీరంగరాజుపల్లిలో పర్యటించిన డీఎంహెచ్‌ఓ మంజువాణి



శ్రీరంగరాజుపల్లిలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, వైద్యసిబ్బంది

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి ఎస్సీ కాలనీలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసి అశోక్‌కుమార్ భార్య శ్రావణి డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయిందని వైద్యాధికారులు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ మంజువాణి శ్రీరంగరాజుపల్లిలో పర్యటించారు. డెంగీ జ్వరం బారిన పడిన శ్రావణి కుటుంబంతో పాటు గ్రామంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు.

డెంగీపై అవగాహన

పరిగి మండలానికి చెందిన శ్రావణి అనే మహిళకు డెంగీ నిర్ధారణ కావడంతో డీఎంహెచ్‌ఓ మంజువాణి మంగళవారం పరిగి మండలంలో పర్యటించారు. తొలుత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్యారోగ్ శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడి నుంచి శ్రీరంగరాజుపల్లికి వెళ్లారు. అనంతపురంలోని ఆస్పత్రిలో డెంగీకి చికిత్స పొందుతున్న శ్రావణి కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. వ్యాధి లక్షణాలతో పాటూ నివారణోపాయాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ బారిన పడిన శ్రావణి ఆరోగ్యం మెరుగుపడినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాధుర్య, మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, నవీన, జుబేర్, డెంటిస్ట్ కోరే మోహన్, సీహెచ్‌ఓ వన్నప్ప, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, పర్యవేక్షకులు గంగాధర్, టెక్నీషియన్ నాగభూషణ, ఫార్మసిస్టు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

బోగస్ పట్టాదారులను జైలుకు పంపేలా చర్యలు



మాట్లాడుతున్న న్యాయవాది శివరామకృష్ణ

పెనుకొండ: పట్టణంలోని సర్వేనంబర్ 668లో బోగస్ పట్టాలు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపేలా చర్యలు తీసుకుంటామని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, న్యాయవాది శివరామకృష్ణ, వెంకటేషులు తదితరులు పేర్కొన్నారు. మంగళవారం బహుజన చైతన్య వేదిక నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో శివరామకృష్ణ మాట్లాడుతూ సర్వేనంబర్ 668లో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 50 సెంట్ల స్థలం కేటాయిస్తే కొందరు వ్యక్తులు దానికి ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం స్థలం కేటాయించడం తప్పా? అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబర్‌లో కొందరు వ్యక్తులు ఏకంగా 3.68 ఎకరాల భూమిని ఆక్రమించుకుని బోగస్ పట్టాలు సృష్టించి ఏకంగా హైకోర్టునే మోసం చేశారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నిజమైన లబ్ధిదారులు పట్టాలు పొందినట్లు కాని, దానికి సంబంధించిన సమాచారం లేదని, దీనిపై పూర్తిగా విచారణ చేయించి కేసులు నమోదు చేయించడమే కాకుండా చట్ట ప్రకారం జైలు శిక్ష పడేలా చూస్తామన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు వెంకటేసులు, రామాంజినప్ప, రవికుమార్, బాబూప్రసాద్, నరసింహులు, కదిరప్ప, రాందాస్, రామకృష్ణ, నరసింహమూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.


అసత్య ప్రచారాలు చేస్తే సహించం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అశోక్

సోమందేపల్లి: తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయ నిర్వహణపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని జెడ్పీటీసీ సభ్యులు అశోక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని తొగట వీర క్షత్రియుల కుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ప్రతికలో ఆలయ అభివృద్ధి జరగలేదని వచ్చిన వార్తలు నిజం కాదన్నారు. కలిసికట్టుగా ఆలయ అభివృద్ధికి గ్రామస్తులతో సామాజిక వర్గం సహకారంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ప్రతి ఏడాది పంచమ జ్యోతుల మహోత్సవం, పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు డీ.సీ. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. కొందమంది స్వార్థం కోసం బురద జల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, వారు అమ్మవారి ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కుల సంఘం నాయకులు సీసీ.హరి, పూజారి ఈశ్వరయ్య, వెంకట రాముడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలు ప్రారంభం



పాండురంగస్వామి అలంకరణలో వేంకటరమణుడు



రుక్మిణి పాండురంగస్వామి కల్యాణం జరిపించిన దృశ్యం

హిందూపురం: తొలి ఏకాదశిని పురస్కరించుకుని హిందూపురంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేట వేంకటరమణస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్ వెంకటరమణస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పండరీపుర పాండురంగస్వామి అలంకరణ చేసి విశేషంగా పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. అలాగే ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో అభిషేకాలు, హోమాల అనంతరం కల్యాణోత్సవం జరిపారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకదశిని పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఆలయంలో హోమాలు నిర్వహించి కల్యాణోత్సవం జరిపారు.

శివకుమార్‌కు ఘన నివాళి



శివకుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివకుమార్ (58) అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ , ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సర్పంచు మంజుల తదితరులు కె.శివరం గ్రామానికి చేరుకొని శివకుమార్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కె.శివరం పంచాయతీలో పార్టీ బలోపేతానికి శివకుమార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే కూడా..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు శివకుమార్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అందరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కల పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యానికి చెక్ పెట్టొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, బీటీ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి

అగళి: మండల పరిధిలోని రామనపల్లి, కురుసంగనపల్లి, హెచ్‌డీ హళ్లి తదితర గ్రామాల్లో మండల ఉద్యాన అధికారి చిన్నరెడ్డయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వక్క తోట రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎర్రనల్లి, నల్లనల్లి అలాగే రసం పీల్చే పురుగుల వల్ల వక్క చెట్లు ఎక్కువగా ఎండిపోతున్నాయన్నారు. దీనికి తగిన మందులను పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

'ప్రేరణ' టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



దీక్ష

హిందూపురం టౌన్: మండలంలోని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని దీక్ష ప్రేరణ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభకనబరిచింది. మంగళవారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇండియా–2024 మార్చిలో నిర్వహించిన ప్రేరణ టాలెంట్ టెస్ట్‌లో దీక్ష ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. జాతీయస్థాయిలో ఆగస్టు 18 నుంచి 24 వరకూ గుజరాత్‌లోని వాగ్నార్ రెసిడెన్షియల్ శిక్షణకు దీక్ష హాజరవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



ఆలూడిలో పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం

భక్తిశ్రద్ధలతో మొహర్రం

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో కుల మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బెల్లం, చెక్కర చదివింపులు చేయించి మొక్కలు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజామునే ప్రత్యేక ప్రార్థనల తర్వాత డప్పు శబ్ధాల మధ్య పీర్ల స్వాములు అగ్నిగుండం ప్రవేశం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.